క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాంకు సేవల పై అవగాహన

మాచర్ల: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ పై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు ఉన్నత పరిషత్ పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. అందులో భాగంగా బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ఆయా పాఠశాలల్లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ సేవలు ఏ విధంగా పొందవచ్చుననే విషయం పై ఉన్నత స్థాయి బ్యాంకు అధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

క్విజ్ పోటీల్లో ఒప్పిచర్ల విద్యార్థినుల ప్రతిభ



కారెంపూడి: దుర్గి, కారెంపూడి రెండు మండలాల స్థాయిలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఫైనాన్స్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ఆర్‌బీఐ గురువారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినులు బొల్నేడి హరిప్రియ, బేతపూడి మనోజ్ఞలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతులను గెలుచుకున్నారని, వీరు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న క్విజ్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం సులక్షణ తెలిపారు. క్విజ్ పోటీల్లో మొత్తం 15 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

దాచేపల్లి : స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్ల కోసం ఆశక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్. రవి కుమార్ గురువారం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 7,8,9 తరగతుల్లో మిగిలిన అతికొద్ది సీట్ల కోసం ఈ నెల 23 నుంచి 28వ తేదీలోపు పాఠశాలలోనే దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 30వతేదీన మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

పట్టణంలో వర్షం



మాచర్ల: నైరుతి ఋతుపవనాల ప్రభావంతో గురువారం తెల్లవారుఝాము నుంచే పూర్తి స్థాయిలో వాతావరణం మారింది. మబ్బులు పట్టి ఉదయం 9గం''ల నుంచి రాత్రి 7గం''ల వరకు వర్షం కురుస్తూనే ఉంది. రెండు నెలలుగా మండుటెండలో అల్లాడిన ప్రజలు వాతావరణం మారి వర్షాలు కురుస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా వర్ష ప్రభావంతో రోడ్ల పై నీరు నిలిచాయి. చల్లటి వాతావరణంలో సేద తీరుతూ ప్రజలు తమ పనులు కొనసాగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు కోరబడుతున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీ వాణి తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 24 లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను స్వయంగా పాఠశాలలో సమర్పించాలన్నారు. అనంతరం సీట్ల భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్ల పంపిణీ జరుగుతుందన్నారు. 7, 8, 9 తరగతుల్లో మొత్తం 42 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో ప్రయోజనాలు

నరసరావుపేట రూరల్: సీసీఆర్‌సీ కార్డులను అర్హులైన రైతులందరూ పొందాలని దళిత బహుజన రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ, ములకలూరు గ్రామాల్లో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం గురువారం నిర్వహించారు. సీసీఆర్‌సీ కార్డులను పొందితే కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందడం ద్వారా ఆర్‌బీకేల నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు పొందవచ్చన్నారు. కౌలు రైతులు తాము వేసిన పంటలను ఈక్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ కుందా చిన్నా, దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ వేణు, పంచాయతీ కార్యదర్శి రామసీత, మహిళా పోలీస్ శాంభవి, ఎంఎల్‌ఓ వెంకటేశ్వర్లు, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పిలుపు నిచ్చిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా...అందని యెడలా సమస్య ఏమిటి అని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి మధ్య వత్యాసాన్ని వివరిస్తూ ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆయన పాలన చరిత్రలో సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా చూసుకుని ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందే విధంగా పాలన చేపట్టిన ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో కూడా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా గెలిపించుకోవాలన్నారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం అందాలంటే తప్పనిసరిగా జన్మభూమి కమిటీల సిఫార్సు ఉండాలని కానీ నేడు ఆ అవసరం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ముందుగా ఎస్సీ కాలనీలోని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, మాడుగుల సర్పంచ్ గనిపల్లి దానమ్మ, మాజీ సర్పంచ్‌లు బండ్ల వెంకయ్య, మాచర్ల మరియమ్మ, మాచర్ల బాబు, జి సాగర్‌బాబు, సిద్దాడపు మురారీ, నాలి గురవయ్య, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, తదితరులున్నారు. ఒక వైపు వర్షం కురుస్తున్నప్పటికి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను వింటూ ముందుకు సాగారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల సమస్యలు వినేందుకు ఎమ్మెల్యే రావడం ఎంతో ఆనందంగా ఉందని గతంలో ఏ ఎమ్మెల్యే ఈ విధంగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు రాలేదని స్థానికులు అంటున్నారు.

ఆర్‌బీకే కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి

రెటచింతల: ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకుఎంతో మేలుజరుగుతుందని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె. సాయిమార్కొండారెడ్డి అన్నారు. మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను తీసుకుని వచ్చి రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అన్ని తమ గ్రామంలోని తక్కువ ధరకు లభించే విధంగా అందిస్తున్నారని తెలియజేశారు. అంతే కాకుండా రైతులకు ఎలాంటి సమస్యల వచ్చినా రైతు భరోసా కేంద్రంలోని సలహాలను పొంది పంట భాగు చేసుకునే విధంగా చేస్తున్నారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, సర్పంచ్‌లు ఒట్టం వెంకటేశ్వరరెడ్డి, చంద్రం, ఎంపీటీసీ పాముల సంపూర్ణమ్మ, వీఏఏలు సతీష్ వెంకటేశ్, ఈఓపీఆర్‌డీ రామచంద్రరావు, బరువు రోజారెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

ముస్లిం కుటుంబానికి కల్యాణ కానుక అందజేత

పిడుగురాళ్ల: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ముస్లిం కుటుంబానికి కల్యాణ కానుకను చింతలపూడి చారిటబుల్ ట్రస్టు సభ్యులు డాక్టర్ చింతల పూడి అశోక్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షేక్ మోహిద్దీన్ బాషా, నాగుల్‌బిల కుమార్తె ముబీనాకు బంగారపు ఉంగరం తోపాటు పట్టు చీర, సారెను అందించి ఆశీర్వదించడం జరిగిందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్‌లు ఇప్పించండి

నరసరావుపేట: స్థానిక పురపాలకసంఘంలో పనిచేస్తున్న 300 మంది కార్మికులకు మూడు నెలలుగా నిల్చిన హెల్త్ అలవెన్స్‌లను మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పురపాలకసంఘ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిమెంట్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు షేక్ శిలార్ మసూద్, టి.మల్లయ్య, ఏ.సాల్మన్, పిట్టా ఏసు, కె.వసంత పాల్గొన్నారు.

మండలంలో రూ. 7.96 కోట్ల పనులకు ఆమోదం

దుర్గి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్‌జీఎస్) అమలు తీరుతెన్నుల పై గత వారం రోజులుగా మండల పరిధిలోని గ్రామ సభలు నిర్వహించి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ గంగారపు జోసఫ్ కుమార్ హాజరై క్షేత్రస్థాయిలో జరిగిన పనుల గురించి ప్రజా ప్రతినిధులు ప్రజలకు వివరించారు. మొత్తం రూ. 7.96 కోట్ల విలువ గల 400 పనులు మండలం పరిధిలో వివిధ గ్రామాల్లో కొనసాగించినట్లు తెలిపారు. వీటిలో రూ. రూ.5.60 కోట్లు కూలీలకు ఖర్చు చేయగా రూ. 2.36 కోట్లు మెటీరియల్ కాంపొండ్ కింద వినియోగించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులను సక్రమంగా మెయింటెన్ చేయాలని, మచ్చర్లలో దిద్దివేతలు లేకుండా చూడాలని వారికి సూచించారు. ప్రభుత్వం తెలిపిన విధంగా ఉపాధి హామీ పనులను ప్రజలకు చేరువ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె సత్యవాణి, ఎపిడిసిహెచ్ సురేంద్ర కుమార్, ఎడివిఓ విజయకుమారి, ఎపిఓ జి వెంకటేశ్వరరావు, ఈఓపిఆర్‌డి జి ఎల్‌ఎన్ గుప్తా, ఎఈ వెలుగొండారెడ్డి, సర్పంచులు గంగారపు వెంకటరెడ్డి, మద్దికర శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు నాలి రామయ్య, జానకి రాము వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆనర్స్ డిగ్రీ కోర్సుపై అవగాహన సదస్సు

వినుకొండ టౌన్: యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు, దేశ వ్యాప్తంగా 2023- 24 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సును అమలు పరుస్తున్న నేపథ్యంలో, తమ కళాశాలలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. యోగయ్య గురువారం తెలియచేశారు. మారిన డిగ్రీ విద్యా విధానంపై తమ కళాశాలలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జరిగే సదస్సులో ఆయా సబ్జెక్ట్స్ నిపుణులు అనేక విషయాలు తెలియచేయడం జరుగుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8885200889 నెంబరుకు సంప్రదించాలన్నారు.

గణపవరం రామాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మితమైన రాతి రామాలయ ప్రతిష్ట ఈ నెల 7న వైభవంగా జరిగిన విషయం విదితమే. ప్రతిష్ట మహోత్సవానికి త్రిదండి చినజీయర్ స్వామి, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. గురువారం నాటికి ఆలయప్రతిష్ట జరిగిన పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా స్వామి వార్లకు ఆలయ ప్రధాన పూజారి దర్శి నాగసాయి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గణపవరానికి చెందిన గీతా సమాజం వారిచే లలితా, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ప్రతిష్ట జరిగిన మరుసటి రోజు నుంచి నేటి వరకూ ప్రతి రోజూ వివిధ ప్రాంతాల వారిచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జులై 17న ఆలయ ప్రతిష్ట జరిగి 41 రోజుల కానున్నందున ఆలయంలో స్వామివార్లకు కళ్యాణం, పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

24న నెలనెలా సాహిత్య మేళ

నరసరావుపేట: నెలనెలా.. సాహిత్య మేళా కార్యక్రమం ఈనెల 24 శనివారం సాయంత్రం పట్టణంలోని భువనచంద్రటౌన్ హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఆధునిక సమాజం పై శ్రీ శ్రీ మహాప్రస్థాన ప్రభావం అనే అంశంపై సాహిత్య చర్చ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రధాన వక్తగా అభ్యుదయ రచయితల సంఘం, మాజీ జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ పాల్గొంటారన్నారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.


పశుబీమా పథకాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పశుబీమా పథకాన్ని మండలంలోని పశుపోషలకులందరూ సద్వినియోగపరుచుకుని ప్రభుత్వం నుంచి బీమా ప్రయోజనాలు పొందాలని మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య గురువారం తెలిపారు. ఆయన వివరిస్తూ రాష్ట్రంలో పాడి రైతులు ,గొర్రెలు, మేకలు ,పందులు, పెంపకందార్లకోసం ఊరట కలిగిస్తూ నూతనంగా పశుబీమా పథకం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ పథకంలో లబ్ధిదారుని వాటా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారికి 20 శాతం వాటా, ఏపీఎల్ రైతులకు 50 శాతం వాటా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకంలో గరిష్ఠంగా ఒక కుటుంబం ఐదు గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులు పశుబీమా చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవు ,గేదెలకు బీమా మొత్తం రూ.30 వేలు పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ కుటుంబాలు రూ.384 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే ఏపీఎల్ కుటుంబాలు రూ.960 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.15 వేల బీమాకు ఎస్సీ,ఎస్టీ ,బీపీఎల్ వారు రూ.192 , ఏపీఎల్ కుటుంబాలు రూ.480 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈపథకం, మూడు సంవత్సరాల వ్యవధి ఉంటుందన్నారు. అదేవిధంగా గొర్రెలు, మేకలకు బీమా రూ.6వేలు , ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ కుటుంబాలు ఏడాది వ్యవధికి రూ.36, ఏపీఎల్ కుటుంబాలు రూ. 90 చెల్లించాలన్నారు. అదేవిధంగా రెండు సంవత్సరాల వ్యవధికి రూ.54, రూ.135 చెల్లించాలి, మూడు సంవత్సరాల వ్యవధికి రూ.రూ.75 రూ.187 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు మీ దగ్గర్లోని రైతు భరోసాకేంద్రం గానీ, మండల పశువైద్యులను గానీ సంప్రదించవచ్చునన్నారు.

కేజీబీవీ వసతి గృహాల్లో ఉపాధ్యాయులుగా కొనసాగించండి

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ సహకారంతో కేజీబీవీ వసతి గృహ పాఠశాలల్లో పనిచేస్తున్న తమను ఉపాధ్యాయ విధుల నుంచి తొలగించవద్దని కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరారు. గురువారం కలెక్టర్‌ను 30 మంది టీచర్లు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లు, వార్డెన్లుగా పనిచేస్తున్న వారిపై పర్మినెంట్ చర్యలు చేపట్టిందన్నారు. తమను కూడా ఉపాధ్యాయ విధుల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, తమకు ఉద్యోగ అవకాశాలను కొనసాగించాలని మహిళా ఉపాధ్యాయులు కలసి విజ్ఞప్తి చేశారు.

నవోదయ నలుగురు రొంపిచర్ల విద్యార్థులు



పోలిశెట్టి త్రినాథ్   నారే కీర్తి   అంగలూరి శ్రీభవ్య   తోడేటి అభిషేక్

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్ల కేరళ మోడల్ స్కూల్ కు చెందిన నలుగురు విద్యార్థులు నవోదయ విద్యకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన పోలిశెట్టి త్రినాథ్, నారే కీర్తి, అంగలూరి శ్రీభవ్య, తోడేటి అభిషేక్‌లు ఉత్తీర్ణులై 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు తెలిపారు.

బాలబాలికలకు కిట్లు పంపిణి

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల కలిగిన బాలబాలికలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హ్యాండీకాఫ్, సమగ్ర శిక్షా వారి సౌజన్యంతో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఫ్రీ ఒకేషనల్ కిట్స్ 40 వేలు విలువ చేసే కిట్లు బాలబాలికలకు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు గురువారం అందజేసినట్లు భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ-2 పుసులూరి లలితాకుమారి, పార్వతీ, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీలేకుండా ఆస్తిపన్ను చెల్లించండి

నరసరావుపేట: 2023-24 మొదటి అర్ధసంవత్సరానికి చెల్లంచాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నులను ఈనెలాఖరులోగా చెల్లించిన వారికి మాత్రమే వడ్డీ రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్ గురువారం వెల్లడించారు. వచ్చే నెల నుంచి చెల్లించేవారు నూటికి రూ.2లు చొప్పున వడ్డీతో చెల్లించాల్సివస్తుందన్నారు. అందువలన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈనెలాఖరులోగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : సహకార బ్యాంక్ అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం వాల్ పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువులకు, విదేశీ విద్యకు, రైతుల కుటుంభాలకు భారం కాకుండా చూడాలనే లక్ష్యంతో నూతనంగా పలు సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. కుటుంబ అవసరాల కోసం, వ్యవసాయ ఋణాలు, వ్యవసాయేతర వంటి వాటికి కూడా ఋణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హనుమంతరావు, బ్యాంక్ సిబ్బంది ఖాదర్ బాబు, పీఏసీఎస్ మాజీ ఛైర్ పర్సన్ వేలమూరి సైదారెడ్డి, దాచేపల్లి-గురజాల మార్కెట్ యార్డు ఛైర్మన్ కలకండ ఆంద్రెయ్య, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాగులుమీరా తదితరులున్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తల్లిదండ్రులు

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల శివారు బాలచంద్రానగర్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్ది బదిలీపై వెళ్తున్న ఆ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆ ప్రాంత ఎంపీటీసీ కొంగర సుబ్రమణ్యం, విద్యాకమిటీ చైర్మన్ శ్యాంసోన్ చేతుల మీదగా హెచ్‌ఎం బి విజయమ్మ, ఉపాధ్యాయులు పి రాధాకృష్ణమూర్తి, ఎంవీ వసంతకుమార్, బి బాలోజీనాయక్‌లను తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. పదేళ్లుగా పాఠశాలను హరితవనంగా అందంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని ఎంపీటీసీ కొంగర ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే నూతనంగా వచ్చిన హెచ్‌ఎం రాఘవరావు, ఉపాధ్యాయులు శివశంకర్, శ్రీరాములు, హనుమాయమ్మ, విజయలక్ష్మీలు కూడా మండలంలోనే ఉత్తమ ఆదర్శ పాఠశాలగా కొనసాగుతున్న బాలచంద్రానగర్ పాఠశాల పేరును అలాగే నిలపాలని కోరుతూ వారికి సాదర స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూసల బుల్లెబ్బాయి, గుండ్లకుంట రామారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, పురుగుమందుల డీలర్లకు అవగాహన సదస్సు



డీలర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విత్తనాలు, పురుగుమందుల డీలర్లకు అవగాహన సదస్సులో ఏఓ వై అమీర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు, ఎరువుల లైసెన్స్‌లో డి ఫాంలు ఇన్‌క్లూడ్ చేసుకోవాలని, ప్రతి నెలా స్టాకు రిపోర్టు వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని వారికి సూచించారు. పురుగు మందుల వ్యాపారస్తులు తమ వద్ద గల స్టాకు గురించి పిసిలుంచుకోవాలన్నారు. ప్రతి వారం విత్తనాలకు సంబంధించి స్టాకు రిపోర్టు అందించి వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. రెంటు అగ్రిమెంట్ గడువు ముగిసినా చలానా కట్టి లైసెన్సును ఎన్‌క్లోజు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతులకు విత్తనాలు, పురుగుమందులు అమ్మాలన్నారు. లేని పక్షంలో షాపు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, పురుగుమందులు అసోసియేషన్ అధ్యక్షుడు పలుచూరి సుబ్బారావు, సెక్రెటరీ కపలవాయి సూర్యనారాయణ, మద్దికర ఆదిరెడ్డి, తోటకూర నాగేశ్వరరావు, విడేల లక్ష్మయ్య, బచ్చు విష్ణుమూర్తి, నూకల శ్రీను పలువురు డీలర్లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న ప్రభాకర్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్స్‌కు లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌పై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ పి. ప్రభాకర్ మాట్లాడుతూ లెప్రసీ మైకో బ్యాక్టీరియా లేప్రె అను సూక్ష్మ క్రిమి వలన ఈ వ్యాధి వస్తుందని, ఈ నెల 26వ నుంచి వచ్చే నెల 16వ తారీకు వరకు జరిగే కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశ, వలంటీర్స్ ప్రతి ఇంటినీ సందర్శించాలని, చర్మాలపై రాగి రంగు స్పర్శ లేని మచ్చలు ఉంటాయని, కనుబొమ్మలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, తెలియకుండానే కాళ్లు చేతులలో బొబ్బలు రావడం, చేతివేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం కుష్టువ్యాధి లక్షణాలని గుర్తించాలన్నారు. అనుమానితులు వెంటనే తగిన పరీక్షలు చేయించుకుని బహుళ ఔషధ చికిత్స పూర్తి చేసినట్లయితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పర్వీన్ బేగం, డాక్టర్ కౌశిక్, పి.ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌వీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో బలోపేతానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 2023-24 నూతన విద్యాసంవత్సరంలో అన్నీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుదలతో పాటు జగనన్న గోరుముద్ద కార్యక్రమం పారదర్శకంగా అమలు జరిగేలా క్షేత్ర స్థాయిలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు 2908 మంది విద్యార్థులకు మంజూరు చేసిందన్నారు. నాడు-నేడు మనబడి పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చోటు చేసుకుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ-2 పుసులూరి లలితాకుమారి, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.విజయలక్ష్మి, సుభాని, అన్నపూర్ణమ్మ, కృష్ణతులసి, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న వైద్యశిబిరం

యడ్లపాడు: లింగారావుపాలెం గ్రామంలో ఈనెల 25వ తేదీన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు సామినేని శ్రీనివాసరావు, ముత్తవరపు రవీంద్ర, గోనుగుంట్ల కిరణ్ తెలిపారు. జీబీఆర్, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్, జనవిజ్ఞాన వేదిక, యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 6 గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఆలోకం వెంకాయమ్మ ప్రథమ వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరం నిర్వహణకు ఆమె భర్త ఆలోకం పెద్దబ్బాయి ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. శిబిరంలో డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ డీవై రెడ్డి, డాక్టర్ మర్రి పెద్దయ్య పాల్గొని బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం, గుండె, కిడ్నీ, కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.